క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ పంపిణీ



తాడూరు: మండలంలోని అల్లాపూర్‌లో బాధితుడు కాసోజు శ్రీనివాస చారికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.60 వేలు మంజూరయ్యాయి. మాజీ సర్పంచ్ శ్రీనివాసులు శుక్రవారం లబ్ధిదారుడికి చెక్కును అందజేశారు.

చెరువు తూముకు మరమ్మతు చేయాలి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని నల్లమల అడవి సమీపంలో ఉన్న జీల్దార్ తిప్ప చెరువుకు తక్షణమే మరమ్మతు చేపట్టాలని ముక్కిడిగుండం, మొలచింతపల్లి రైతులు ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం ముక్కిడిగుండం సమీపంలోని అడవిలో ఉన్న జీల్దార్ తిప్ప చెరువును రైతులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు ఆయకట్టు రెండు గ్రామాల్లో ఐదు వేల ఎకరాలు ఉంటుందని పేర్కొన్నారు. తూము సక్రమంగా పని చేయకపోవడంతో సాగునీరు అందడం లేదని వాపోయారు. అదే విధంగా కేఎల్ఐ ప్రాజెక్టు నుంచి చెరువుకు సాగునీరు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, బాలపీరు, బాలస్వామి, ఆశన్న, గంగ రాముడు, తదితరులు ఉన్నారు.

20 శాతం నిధులు కేటాయించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర బడ్జెట్‌లో దళిత సామాజిక వర్గానికి 20 శాతం నిధులు కేటాయించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక లక్ష్మణచారి భవనంలో నిర్వహించిన డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యకర్తల సమావేశంలో కొమ్ము భరత్ పాల్గొని మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉండి దళితులను మోసం చేసిందని ఆరోపించారు. అంబేడ్కర్ అభయ హస్తం పేరుతో దళితులకు రూ.12 లక్షలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మారేడు శివశంకర్, శ్రీనివాసులు, నరసింహ, ఆంజనేయులు, భగవంత్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

పెద్దకొత్తపల్లి: మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్ఐ సతీష్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. వాహనదారులు హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన పత్రాలను దగ్గరగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సంపత్, మల్లేష్, పాల్గొన్నారు.

ఈదమ్మ ఆలయంలో మండలాభిషేకం



కొల్లాపూర్: పట్టణంలోని ఈదమ్మ గుడి పునర్నిర్మాణం, విగ్రహ పునఃప్రతిష్ఠ జరిగి 41 రోజులు పూర్తైన సందర్భంగా ఈదమ్మ గుడిలో మండలాభిషేకం పూజలు నిర్వహించారు. గుడి పునర్నిర్మాణ కర్త, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలో హోమం నిర్వహించారు. దేవతామూర్తికి అభిషేకాలు చేశారు. నాయకులు నరేందర్‌రెడ్డి, సాంబశివుడుయాదవ్, రాజేష్, సురేందర్‌గౌడ్, సురేందర్‌రావు, బిజ్జ వేణు, సాకలి నర్సింహ, రమేష్ ఉన్నారు.

నియోజకవర్గ అధ్యక్షుడిగా రుక్కులు గౌడ్

కల్వకుర్తి రూరల్: తీన్మార్ మల్లన్న టీం నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కారువంగా రుక్కుల్ గౌడ్ నియామకమయ్యారు. ఈ మేరకు శుక్రవారం మల్లన్న టీం రాష్ట్ర అధ్యక్షుడు రజని ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట సభ్యులు నాగరాజు, రమేష్, ఆనంద్ గౌడ్ తదితరులున్నారు.

విరాళం అందజేత

వెల్దండ: మండలంలోని రాచూర్ గ్రామంలోని శివాలయ, ఆంజనేయస్వామి దేవాలయాలకు రంగులు వేసేందుకు శుక్రవారం గ్రామానికి చెందిన గంగదారి యాదగిరి రూ.5 వేలు విరాళం అందజేశారు.



మన్ననూర్‌లో..



చారకొండలో హోలీ సంబరాల్లో చిన్నారులు, మహిళలు



కొల్లాపూర్‌లో..

హోలీ రంగుల కేళి



తాడూరులో కాముడి దహనంలో పాల్గొన్న గ్రామస్తులు



నాగర్‌కర్నూల్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



తెలకపల్లిలో..



కల్వకుర్తిలో ..



బల్మూర్‌లో..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శుక్రువారం హోలీ సంబరాలను నిర్వహించారు. చిన్నారులు, యువకులు, మహిళలు ఉదయాన్నే రంగులు చేత పట్టుకుని వీధుల్లో తిరుగుతూ తోటి స్నేహితులకు రంగులు పూసి సంబురపడ్డారు. వయో బేధం లేకుండా హోలీ వేడుకలు జరుపుకున్నారు. గురువారం రాత్రి ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో కాముడి దహనం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. యువతీ యువకులు డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. ఈగలపెంటలోని జెన్‌కో కాలనీలో భూగర్భ కేంద్రంలో పనిచేస్తున్న గిరిజన ఉద్యోగులు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కల్వకుర్తిలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ తీశారు. కొల్లాపూర్, కల్వకుర్తి, బిజినేపల్లి, తాడూరు, తెలకపల్లి, అచ్చంపేట, బల్మూర్, లింగాల, అమ్రాబాద్, ఉప్పునుంతల, మన్ననూరు, వంగూరు, పదర, చారకొండ, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి, కోడేరులలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి.



నాగర్‌కర్నూల్ శ్రీనగర్ కాలనీలో ..



కల్వకుర్తి హోలీ వేడుకలో ఆర్ఎస్ఎస్ నాయకులు



బిజినేపల్లి పెద్దతండాలో కర్రలు చూపిస్తూ హోలీ వేడుకలు నిర్వహిస్తున్న తండావాసులు



వెల్దండ మండలం పెద్దాపూర్‌లో..



తిమ్మాజిపేట అప్పాజిపల్లిలో



తెలకపల్లి నెహ్రూ చౌరస్తాలో..



ఉప్పునుంతల మండలం కంసానిపల్లిలో..

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



ఎన్టీఆర్ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కొల్లాపూర్: బడ్జెట్ సమావేశాల నుంచి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జగదీష్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్ వేటును ఎత్తేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, సాంబశివుడుయాదవ్, సురేందర్‌రావు, శంకర్‌నాయక్, శేఖర్, నాగరాజు, కురుమయ్య, శ్రీనివాసులు, తిరుపతయ్య, కలర్‌మహేష్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రజల తరపున శాసన సభలో ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మాజీ జెడ్పీటీసీ శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, రహీం, కొత్త గంగాధర్, హనుమంతరావు, బాబురావు, చంద్రశేఖర్ రెడ్డి, తిమ్మాజిపేట పాండు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు కేటాయించడంపై హర్షం

కల్వకుర్తి రూరల్: శాసనమండలి సభ్యుల ఎన్నికల్లో పార్టీలు బీసీలకు ప్రాధాన్యత కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ రాబోయే రోజుల్లో అన్ని పార్టీలు బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి నియోజకవర్గ అధ్యక్షుడు మేకల రాజేందర్ కోరారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు గాను మూడు బీసీలకు ఇచ్చారన్నారు. కాంగ్రెస్, సీపీఐ, బీఆర్‌ఎస్ పార్టీల అధిష్టానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండోజు గంగాధర్, భాను ముదిరాజ్, ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు జమ్ముల శ్రీకాంత్, జాగృతి జిల్లా అధ్యక్షుడు గణేష్, సాగర సంఘం జిల్లా కోశాధికారి పడకంటి రాజు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబకు నివాళి



నివాళులర్పిస్తున్న శాలివాహన నాయకులు

చారకొండ: మండలంలోని జూపల్లిలో శుక్రవారం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కవయిత్రి చిత్రపటానికి సంఘం ఆధ్వర్యంలో పూలమాలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో ప్రధాన రహదారిపై చిత్రపటంతో వాహనంలో చిత్రపటాన్ని ఊరేగించారు. రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగులో మొల్లమాంబ రచించిందని కొనియాడారు. కార్యక్రమంలో శాలివాహన సంఘం నాయకులు మాడుగుల బాలస్వామి, సిర్సవాడ గోపాల్, హుస్సేన్, జంగయ్య, అంజనేయులు, నరేష్, మహేష్, జంగయ్య, కృష్ణయ్య ఉన్నారు.

సంత సమస్యల చింత



చిన్నంబావి ప్రధాన రోడ్డుపై కొనసాగుతున్న సంత

- రోడ్లపైనే నిర్వహణ
- మౌలిక వసతులు కరువు

చిన్నంబావి: మండల కేంద్రంలో ప్రతి గురువారం సంత నిర్వహించేందుకు వనరులున్నా వసతులు మాత్రం లేవు. దీంతో రోడ్లపైనే సంత నిర్వహిస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంత ద్వారా ఏడాదికి పంచాయతీకి రూ.లక్ష ఆదాయం వస్తోంది. కానీ సంతను అభివృద్ధి చేసేందుకు అధికారులు ఆసక్తి చూపడం లేదు.

రోడ్లపైనే సంత ..

చిన్నంబావి మండల కేంద్రంలో ప్రధాన చౌరస్తా, వాల్మీకి విగ్రహం చుట్టూ ప్రధాన రహదారిపైనే సంత నిర్వహింస్తుడటంతో ప్రజలు, వ్యాపారులు అవస్థలు పడుతూ అసౌకర్యానికి గురవుతున్నారు. వ్యాపారులు చిన్న చిన్న టెంట్లు వేసుకొని వస్తువుల విక్రయాలు జరుపుతుంటారు. వర్షాకాలంలో వీరి బాధలు వర్ణణాతీతం. సంతకు ప్రత్యేక స్థలం కేటాయించి అక్కడే షెడ్లు నిర్మించాలని, షెడ్ల నిర్మాణం చేపడితే అడ్వాన్స్‌ల రూపంలో చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యాపారులు చెబుతున్నారు. అధికారులు స్పందించి సంతకు ప్రత్యేక స్థలం కేటాయించి షెడ్లు నిర్మించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

మరుగుదొడ్లు లేక..

మండల కేంద్రంలో ప్రధాన రోడ్లపైనే సంత ఏర్పాటు చేస్తున్నారు. కొప్పునూరుకు వెళ్లే ప్రధాన రోడ్డు, కొల్లాపూర్-పెబ్బేరు రోడ్డుపై, పెద్దమారు రోడ్డుపై సంత నిర్వహిస్తున్నారు. సంత ప్రదేశంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి కనీసం మరుగుదొడ్లు అయినా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

స్థలం కేటాయించాలి



మండల కేంద్రంలో నిర్వహించే సంతకు ప్రత్యేక స్థలం కేటాయించాలి. రోడ్లపై సంత నిర్వహించడం వల్ల వాహనదారులు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– స్వాములు, చిన్నంబావి

రోడ్లపై దుకాణాలతో..



సంతలో రోడ్డు పక్కన షాపులు ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంకో ప్రదేశంలో సంత జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పరశురాం, చిన్నంబావి

పీడీఎస్ బియ్యం పట్టివేత

అచ్చంపేట రూరల్: ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం సివిల్‌సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఎస్ఐ వివరాల ప్రకారం పట్టణంలోని చింతల్‌బస్తీ కాలనీలోని రజియాబేగం ఇంటిలో పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారు. విషయం తెలుసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ హేమ్లు తనిఖీలు నిర్వహించారు. మొత్తం ఎనిమిది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. అనంతరం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

పెట్రోల్‌కు నిప్పు కిరాణదుకాణం దగ్ధం

ఒకరికి గాయాలు



తెలకపల్లి: పెట్రోల్‌కు నిప్పు పెట్టడంతో కిరాణ దుకాణం దగ్ధమై ఒకరికి గాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు.. మండలంలోని చిన్నముద్దునూరు బస్టాండ్ సమీపంలో అదే గ్రామానికి చెందిన రాధకు సంబంధించిన కిరాణ దుకాణంలో శుక్రవారం మంతటి గ్రామానికి చెందిన నిరంజన్ ఆ షాప్‌లో పెట్రోల్ కొనుగోలు చేశాడు. వినియోగదారుడు బాటిల్‌లో ఉన్న పెట్రోల్‌ను కింద పారపోసి అగ్గిపుల్ల గీసి నిప్పు పెట్టాడు. ఒక్కసారిగా మంటలు వ్యాపించి కిరాణ దుకాణంలో ఉన్న సామగ్రి వస్తువులు కాలిపోయాయి. నిరంజన్ ముఖానికి మంటలు అంటుకోవడంతో ముఖానికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

జోరుగా సారా విక్రయాలు



కోడేరు: మండల కేంద్రంతో పాటు బావాయిపల్లి తదితర గ్రామాల్లో సారా విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. కిరాణ దుకాణాల్లో కొందరు బహిరంగంగా సారా విక్రయాలు చేస్తుండటంతో సారా తాగి కాలనీలో ఘర్షణ పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. శుక్రవారం యువకుడు సారా తాగి రోడ్డుపై పడ్డాడు. అటువైపు గుండా వెళ్లే మహిళలు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సారా విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

నాగర్‌కర్నూల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 17వార్డు బీసీ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ కాలనీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఐదోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షాశిబిరం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలని, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ సభ్యులు పర్వతాలు, రమేష్, బాలరాజు, రవి, గోపాల్, సురేందర్, ఈశ్వరమ్మ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, మండల కార్యదర్శి పొదిల రామయ్య పాల్గొన్నారు.

